సాక్షి ఖమ్మం

శనివారం ❘ 1 ❘ జూన్ ❘ 2024



మముబ్రోవమని చెప్పండి

సీతారామ లింక్ కెనాల్ పేరుతో తమ భూములను దౌర్జన్యంగా లాక్కుంటున్నారని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. 10లో



..మట్టి తోలకాలు బంద్

ఏదులాపురం చెరువులో అనుమతి లేకుండా మట్టి తోలకాలపై సాక్షి కథనానికి అధికారులు స్పందించి చెక్ పెట్టారు. 10లో



వాతావరణం

జిల్లాలో శనివారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయం ప్రారంభమైన ఎండ గంటగంటకూ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

డీసీసీబీ ఉద్యోగుల బదిలీపై విచారణ

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో ఇటీవల జరిగిన ఉద్యోగుల బదిలీల వ్యవహారంలో విచారణ ప్రారంభమైంది. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 92 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను, 30 మంది మేనేజర్లను డీసీసీబీ సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ బదిలీ చేశారు. ఈ వ్యవహారంలో సీఈఓకు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుకు మధ్య వివాదం కూడా చోటుచేసుకుంది. ఈ క్రమంలో బదిలీల ప్రక్రియపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పలువురు ఉద్యోగులతోపాటు ఒక సంఘానికి చెందిన ఉద్యోగుల బదిలీలు అనుకూలంగా జరిగాయని ఆరోపిస్తూ మరో సంఘం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై విచారణ చేయాలని మంత్రి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు డీసీఓ ఖుర్షీద్.. అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్‌ను విచారణాధికారిగా నియమించారు. దీంతో ఆయన విచారణ చేపట్టారు.

9న జూనియర్ సివిల్ జడ్జి మోడల్ టెస్ట్

ఖమ్మంలీగల్: అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు జూన్ 9న ఉదయం 10 గంటలకు ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్‌లో జూనియర్ సివిల్ జడ్జి మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఐలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లమల నవీన్ చైతన్య, చింతనిప్పు వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసే న్యాయవాదులంతా సకాలంలో హాజరు కావాలని కోరారు.

రెండు లక్షల ఎకరాల్లో పత్తి సాగు: డీఏఓ

తల్లాడ: జిల్లాలో ఈ ఏడాది 2.02 లక్షల ఎకరాల్లో పత్తి సాగుకు రైతులు సిద్ధమయ్యారని, ఇందుకోసం 4.50 లక్షల ప్యాకెట్ల విత్తనాలు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. తల్లాడ పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు విత్తనాల సరఫరాను శుక్రవారం ఆమె పరిశీలించారు. సొసైటీకి ఎన్ని విత్తనాలు వచ్చాయి, ఎంతమంది రైతులకు పంపిణీ చేశారనే వివరాలపై ఆరా తీసి, కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని తెలిపారు. గోడౌన్‌లో పది బస్తాలు దాచిన వారిని విచారించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో విత్తనాలకు కొరత లేదని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే పీడీ యాక్ట్ కూడా పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏడీఏ నరసింహారావు, టెక్నికల్ ఏఓ చాయారాజ్, ఏఓ ఎండి.తాజుద్దీన్, డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు అన్వర్, కె.సందీప్, సీఈఓ నాగబాబు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ కోచింగ్ కోర్సులో జిల్లా క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయిలో డి. లైసెన్స్ ఫుట్‌బాల్ కోచింగ్ కోర్సులో ఉమ్మడి జిల్లా నుంచి సాయిరాం, నోయల్ జాక్సన్ హాజరయ్యారని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ తెలిపారు. ఈ కోర్సు మే 25 నుంచి 30వ తేదీ వరకు భువనగిరి జిల్లా కేంద్రంలోని ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిందని పేర్కొన్నారు. ఇలాంటి కోర్సుకు జిల్లా నుంచి ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. జిల్లా నుంచి పాల్గొన్న క్రీడాకారులను అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఈ.సెల్యూకాస్ అభినందించారు.

స్థానిక పోరుపై సందిగ్ధం



- పంచాయతీ ఎన్నికలకు ఇటీవల సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ఆ తర్వాత ముందుకు సాగని ప్రక్రియ
- ప్రత్యేకాధికారుల పాలనలో జీపీలు
- కొత్త రిజర్వేషన్ల పై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 1,070 గ్రామ పంచాయతీలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం : గడువు తీరిన గ్రామపంచాయతీ పాలక వర్గాల ఎన్నికలకు ఇప్పట్లో ముహూర్తం కుదిరేలా లేదు. ఈ జూన్‌లో పంచాయతీ ఎన్నికలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించినా.. ఆ దిశగా అడుగులు పడడం లేదు. గత ఫిబ్రవరి 1న పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఆ సమయంలో ఈసీ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎన్నికల సామగ్రి సిద్ధం చేశారు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడంతో పంచాయతీ ఎలక్షన్లు జూన్‌లో నిర్వహిస్తారని అంతా భావించారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు కొనసాగిస్తారా.. మారుస్తారా.. అనే చర్చ అంతటా జరుగుతోంది. మరోవైపు బీసీ జనగణన చేసిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ వస్తోంది. దీంతో పంచాయితీ ఎన్నికలకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని 1,070 గ్రామ పంచాయతీ పాలక వర్గాల గడువు ముగియడంతో ప్రస్తుతం కార్యదర్శుల పాలన కొనసాగుతోంది.

నాలుగు నెలలుగా..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 1,070 జీపీలు ఉండగా.. 2019లో 1,061 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. అదే ఏడాది ఫిబ్రవరి 2న పంచాయతీ పాలక వర్గాలు కొలువుదీరాయి. ఐదేళ్లపాటు పాలక వర్గాలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాయి. పాలక వర్గాల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరి 1తో ముగిసింది. దీంతో అప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకాధికారులుగా పాలన బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం జిల్లాలో 589 గ్రామ పంచాయతీలు ఉండగా.. 579 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. మరో 10 గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్‌లుగా పంచాయతీ కార్యదర్శులు వ్యవహరిస్తున్నారు. గత నాలుగు నెలలుగా వీరి పర్యవేక్షణలోనే గ్రామాల్లో పాలన సాగుతోంది. భద్రాద్రి జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు ఉండగా..477 జీపీలకు ఎన్నికలు జరిగాయి. ఖమ్మం జిల్లాలో 584 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు.

ఎన్నికలకు ఏర్పాట్లు చేసినా..

గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు కూడా నిర్వహించాలని భావించింది. ప్రధానంగా గ్రామ పంచాయతీల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగుస్తున్నందున ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. పార్లమెంట్ ఎన్నికల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ప్రకటించారు. అలాగే రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్‌కు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు కూడా చేశారు. ఎన్నికల సామగ్రి సిద్ధం చేశారు. బ్యాలెట్ బాక్సులు తదితర సామగ్రిని అందుబాటులో ఉంచారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల వివరాలను కార్యదర్శుల ద్వారా రాష్ట్ర ఎన్నికల సంఘం సేకరించింది. ఆ తర్వాత ఎన్నికలకు సంబంధించి ఎటువంటి కార్యాచరణ ముందుకు సాగలేదు.

రిజర్వేషన్ల పీటముడితో..

గ్రామ పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ప్రధాన అడ్డంకిగా మారాయి. 2019లో జీపీ ఎన్నికల సందర్భంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 గ్రామ పంచాయతీ చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారమే నాడు ఎన్నికలు నిర్వహించారు. దీని ప్రకారం రిజర్వ్‌డ్ పంచాయతీలకు పదేళ్లపాటు ఒకే రిజర్వేషన్ ఉంచి ఎన్నికలు నిర్వహించే వెసులుబాటు కలిగింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ చట్టం ప్రాతిపదికగా ఎన్నికలు నిర్వహిస్తుందా.. లేక కొత్త చట్టం తెస్తుందా అనేది స్పష్టత రాలేదు. కొత్త చట్టాన్ని తీసుకొస్తే పంచాయతీతో పాటు వార్డుల రిజర్వేషన్లు కూడా మారుతాయి. మరోవైపు బీసీ గణన తదితర కార్యక్రమాలతో ఎన్నికలు ఆలస్యం అవుతాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

ఆశావహుల ఎదురుచూపు..

గ్రామస్థాయి నేతలు పంచాయతీ ఎన్నికల సమరం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ జూన్‌లో ఎన్నికలు ఉంటాయనే ఉద్దేశంతో పోటీకి ఆయా పార్టీల నేతలు అన్నీ సిద్ధం చేసుకున్నారు. అయితే ఎన్నికలు మరికొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉండటంతో ఎప్పుడు జరుగుతాయోనని ఆరా తీస్తున్నారు. గతంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా ఉన్న వారితోపాటు కొత్త వారు కూడా పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా పంచాయతీ ఎన్నికల చర్చే సాగుతోంది. బరిలో నిలబడేందుకు రాజకీయ పార్టీల మద్దతు కోసం ఆశావహులు తమ ప్రయత్నాల్లో మునిగారు.

ఖమ్మం జిల్లాలో గ్రామ పంచాయతీలు	589
ఎన్నికలు నిర్వహించినవి	584
ఎన్నికలు నిర్వహించనివి	05
జిల్లాలోని వార్డులు	5,389
పంచాయతీ కార్యదర్శులు	579
పంచాయతీ కార్యదర్శుల ఖాళీలు	10

భద్రాద్రి జిల్లాలో గ్రామ పంచాయతీలు	481
ఎన్నికలు జరిగినవి	477
ఎన్నికలు నిర్వహించనివి	04
వార్డులు	4,232
ప్రత్యేక అధికారులు	476

మూడేళ్ల లోపే అర్హులందరికీ ఇళ్లు



తిమ్మక్కపేటలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి హామీ
- 'పాలేరు' నా సొంతిల్లు.. చక్కబెట్టుకునే బాధ్యత నాదే..
- తిరుమలాయపాలెం మండలంలో విస్తృత పర్యటన

తిరుమలాయపాలెం : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇళ్లు రాక ఇబ్బంది పడిన అర్హులైన పేదలందరికీ మూడేళ్లలోనే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి, ఎర్రగడ్డ, తిమ్మక్కపేట, తాళ్లచెరువు, బీరోలు, ఏలువారిగూడెం, బంధంపల్లి, బచ్చోడుతండా, సోలిపురం, రాజారాం, పైనంపల్లి, జూపెడ, కాకరవాయి, సుద్దవాగుతండా, ముజాహిద్‌పురం, ఏనెకుంటతండా, మంగళిబండతండా, రఘునాథపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'మీ శీనన్న ఎన్నికలప్పుడు ఓట్లకోసమే వచ్చే వ్యక్తి కాదు.. ఇప్పుడు ఎన్నికలు లేవు.. ఓట్లు అడగాల్సిన అవసరం లేదు. మీ ఆశీస్సులు, దీవెనలతో ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిని అయ్యా. మీ సమస్యలేంటో నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే వచ్చా' అని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ప్రతి వినతిని పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తానని చెప్పారు. అత్యధిక మెజారిటీతో గెలిపించి మంత్రిగా అవకాశం కల్పించిన ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు దక్కేలా చూస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, అయితే ఆ శాఖ మంత్రిని తానే కాబట్టి పాలేరు నియోజకవర్గంలో మూడేళ్ల లోపే వచ్చేలా చూస్తానని ప్రకటించారు. ఏడాదిలోగా నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లు, డ్రెయినేజీలు పూర్తిచేయిస్తానని, తాగు, సాగునీటికి ఇబ్బంది రాకుండా చూస్తానని భరోసా ఇచ్చారు. సీతారామ ప్రాజెక్టు పనులు ఆలస్యం అవుతుండడంతో పాలేరు రిజర్వాయర్‌ను నింపేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఆగస్టు 15 నాటికి రైతుల రుణమాఫీ అమలవుతుందన్నారు. రాజారం గ్రామంలో ఇటీవల గడ్డి మందు కొట్టిన పంటను తిని గొర్రెలు మృతిచెందగా, మూడు బాధిత కుటుంబాలకు రూ.2.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వ పరంగా కూడా నష్టపరిహారం ఇప్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణల్లో గాయపడిన మేడిదపల్లికి చెందిన మోర చంద్రారెడ్డిని మంత్రి పొంగులేటి పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, ఎంపీపీ మంగీలాల్, నాయకులు చావా శివరామకృష్ణ, రామసహాయం నరేష్‌రెడ్డి, గంధ్ర గోపాలరావు, కొప్పుల అశోక్, ప్రతాప్, జడల నగేష్, కర్నాటి శ్రీను, వైస్ ఎంపీపీ బుద్దా వంశీకృష్ణ, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్, ఆర్ఓ గౌతమ్

ఖమ్మం సహకారనగర్ : పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. శుక్రవారం ఆయన సీపీ సునీల్‌దత్‌తో కలిసి కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రం, ఆవరణలో చేపట్టాల్సిన బారికేడింగ్‌పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వైద్య శిబిరం, మీడియా పాయింట్‌పై పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు ఫలితాల ప్రకటనకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ సునీల్‌దత్

విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

ఖమ్మంవ్యవసాయం : రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. శుక్రవారం ఆయన నగరంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. నిల్వలు, విక్రయ రశీదులు పరిశీలించి స్టాక్ బోర్డ్‌లో వివరాలు సక్రమంగా నమోదు చేయాలని యజమానులను ఆదేశించారు. ఏయే పంటలు, ఏ రకం విత్తనాలను రైతులు ఎక్కువగా అడుగుతున్నారని ఆరా తీశారు. ఆ సమయంలో దుకాణాలకు వచ్చిన రైతులతో మాట్లాడి గతేడాది ఏ పంట వేశారు.. ఇప్పుడేం వేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల విత్తనాలు ఒక్కటేనని, ఏదో ఒక రకమే కావాలంటూ దానికి డిమాండ్ పెంచి నష్టపోవద్దని సూచించారు. జిల్లాలో అవసరమైన మేర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులకు సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నకిలీ విత్తనాలపై నిఘా ఏర్పాటు చేశామని, వ్యవసాయ, పోలీస్ అధికారులతో కలిపి టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేశామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, అదనపు డీసీపీ ప్రసాదరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్యామ్‌ప్రసాద్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, ఏడీఏ శ్రీనివాసరావు, ఖమ్మం అర్బన్ ఏఓ కిషోర్ బాబు పాల్గొన్నారు.

వైద్య కళాశాల స్థల పరిశీలన

తరగతుల నిర్వహణపై డీఎంఈ వాణి ఆరా

ఖమ్మంవైద్యవిభాగం : ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలను మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(డీఎంఈ) డాక్టర్ వాణి శుక్రవారం సందర్శించారు. ప్రిన్సిపాల్ ఎస్. రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బందితో సమావేశమై తరగతులు, బోధన తీరుపై చర్చించారు. ఎంబీబీఎస్ మొదటి తరగతి విద్యార్థులకు ఎంతమేర సిలబస్ పూర్తి చేశారు, పరీక్షలకు ఎలా సన్నద్ధం చేస్తున్నారు, రెండో ఏడాది తరగతుల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం రఘునాథపాలెం శివారులో వైద్య కళాశాల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణ పనులపై ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్యాంప్రసాద్‌తో చర్చించారు. ఆ తర్వాత కలెక్టర్ వి.పి.గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ విమల థామస్, వైస్ ప్రిన్సిపాల్ బి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



వైద్య కళాశాల స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎంఈ వాణి

పెండింగ్ ఫైళ్లు పరిష్కరించాలి

ఖమ్మం సహకారనగర్: ధరణి పెండింగ్ ఫైళ్ల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధరణి ఫిజికల్ ఫైళ్ల ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. తహసీల్దార్లు ఫిజికల్ ఫైళ్లను అప్‌లోడ్ చేస్తే, ఆర్డీఓల లాగిన్‌కు వస్తాయని, వారు పరిశీలించి తనకు సమర్పించాలని సూచించారు. ఫిజికల్ ఫైళ్ల ఆన్‌లైన్, పెండింగ్ రిజిస్ట్రేషన్లపై ఈనెల 7న కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తారని, ఆలోగా అన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. డీఆర్ఓ ఎం.రాజేశ్వరి, ఆర్డీఓలు గణేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇక కాలేజీ బాట..

- నేటి నుంచి జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఇంటర్ ప్రథమ సంవత్సర అడ్మిషన్లు అంతంతే..
- అరకొరగానే పుస్తకాల సరఫరా

ఖమ్మం సహకారనగర్ : ఇంటర్మీడియట్ విద్యార్థులకు శనివారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. కాలేజీల పునః ప్రారంభం నేపథ్యంలో జిల్లాలోని పలు కళాశాలలను శుక్రవారమే శుభ్రం చేయించారు. జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా వీటిలో ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ఇప్పటి వరకు 150 మాత్రమే వచ్చాయి. ఇక గతేడాది ప్రథమ సంవత్సరం చదివి, ఇప్పుడు ద్వితీయ సంవత్సరంలోకి అడుగుపెట్టే జనరల్, ఒకేషనల్ విద్యార్థులు కలిపి 3,107 మంది ఉన్నారు. వీరంతా నేటి నుంచి కళాశాలలకు హాజరయ్యే అవకాశం ఉంది. తరగతుల ప్రారంభం నేపథ్యంలో విద్యార్థుల వాట్సప్ గ్రూప్‌ల్లో పోస్ట్ చేయడంతో పాటు తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం అందించారు.

చేరికలు అంతంతే.. పుస్తకాలు అరకొరే..

జిల్లాలో ఇప్పటివరకు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. శనివారం నుంచి కళాశాలలు పునఃప్రారంభం అవుతుండగా.. ప్రస్తుతం 150 మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందడం గమనార్హం. ఇక ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పుస్తకాలు అరకొరగానే అందుబాటులో ఉన్నాయి. జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు 27,640 పుస్తకాలు అవసరం కాగా 5,458 పుస్తకాలు మాత్రమే వచ్చాయి. మిగతావి త్వరలోనే వస్తాయని అధికారులు అంటున్నారు.



నయాబజార్ కళాశాలలో శుభ్రం చేస్తున్న దృశ్యం

సౌకర్యాలు శూన్యం..

జిల్లాలోని 20 కళాశాలల్లో 13 కాలేజీల భవనాలకు మరమ్మతులు చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, అనుమతి రాగానే పనులు చేపడతామని అంటున్నారు. 16 కళాశాలల్లో టాయిలెట్ల నిర్మాణానికి రూ.1.38 కోట్లు విడుదల కాగా పలు కళాశాలల్లో పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. మరికొన్ని పురోగతిలో ఉన్నాయి.

జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు	20
ద్వితీయ సంవత్సర విద్యార్థులు	3,107
ప్రథమ సంవత్సర విద్యార్థులు	150
అవసరమైన పుస్తకాలు	27,640
అందుబాటులో ఉన్నవి	5,458

అడ్డొచ్చిన ఎన్నికల కోడ్..

ఈ ఏడాదిలో వరుసగా ఎన్నికల కోడ్ వస్తున్న క్రమంలో వివిధ అభివృద్ధి పనులకు ఆటంకం కలిగినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పెండింగ్ పనులు పూర్తి కానుండగా.. పరిపాలన పరమైన అనుమతులు సైతం వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

అడ్మిషన్లు పెరిగేలా చూస్తున్నాం



జూనియర్ కళాశాలలు శనివారం పునఃప్రారంభం అవుతున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు అందుతాయి. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లోనే చేరేలా చూస్తున్నాం. ఈ మేరకు విద్యార్థులకు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పుస్తకాలను విద్యార్థులకు అందించి, మిగితావి కూడా త్వరలో తెప్పిస్తాం.పలు కళాశాలల్లో టాలెయిట్ల నిర్మాణ పనులు జరుగుతుండగా, మరమ్మతులు అవసరమైన కాలేజీల వివరాలు ఉన్నతాధికారులకు నివేదించాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. – కె.రవిబాబు, డీఐఈఓ.

హనుమాన్ భక్తులకు సౌకర్యాలేవి?

ఆంజనేయ మాల విరమణకు తరలివస్తున్న భక్తులు

- ప్రతీ ఏడాది భద్రగిరికి పెరుగుతున్న మాలధారులు
- రద్దీకి తగిన ఏర్పాట్లు చేయని దేవస్థానం అధికారులు
- ప్రత్యేక హాళ్లు కేటాయించాలని మాలధారుల వేడుకోలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: హనుమాన్ మాలధారులు భద్రాచలానికి పోటెత్తుతున్నారు. అయితే పెరుగుతున్న భక్తుల రద్దీకి తగినట్టు శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. గడిచిన రెండు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో హనుమాన్ మాల ధరిస్తున్న భక్తుల సంఖ్య పెరుగుతోంది. సాధారణంగా పదకొండు, ఇరవై ఒకటి, నలభై ఒక్క రోజుల దీక్షతో హనుమాన్ మాల ధరిస్తారు. ఆ తర్వాత ఇంటి దగ్గర మాతృమూర్తి సమక్షంలో లేదంటే ప్రముఖ ఆలయాల్లో మాల విరమణ చేసేందుకు మొగ్గు చూపుతుంటారు. ఆలయాల్లో మాల విరమణ చేసే భక్తులు ముందుగా నదీ/పుష్కరిణిలో స్నానమాచరిస్తారు. ఆ తర్వాత ఇరుముడి సమర్పణ చేస్తారు. అనంతరం మాల విరమణ క్రతువు నిర్వహిస్తారు. ఇందుకోసం కొండగట్టు ఆంజనేయ స్వామి, విజయవాడ కనక దుర్గ, శ్రీశైలం మల్లన్న, తిరుపతి తదితర దేవస్థానాల్లో ఇరుముడి సమర్పణకు, సాముహిక మాల విరమణకు ప్రత్యేకంగా హాళ్లు ఉన్నాయి. ఇక్కడ ఒకేసారి రెండు మూడు వందల మంది భక్తులు సామూహికంగా మాల విరమణ చేయవచ్చు. తెలంగాణ ఏర్పాటు తర్వాత హనుమాన్ భక్తుల్లో భద్రాచలం పుణ్యక్షేత్రానికి ప్రాధాన్యత పెరిగింది. హనుమాన్ మాల ధరించిన భక్తులు మొదటి ప్రాధాన్యతగా జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆలయాన్ని దర్శించుకుంటుంటే తదుపరి స్థానంలో ఇప్పుడు భద్రాచలం ఉంటోంది.



రామాలయంలో హనుమాన్ భక్తుల రద్దీ (ఫైల్)

కనీస సౌకర్యాలు కరువు

ఆంజనేయ మాల ధరించిన భక్తులకు భద్రాచలంలో సరైన ఏర్పాట్లు లేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం గోదావరిలో స్నానం చేసిన భక్తులు ఆలయ ప్రాంగణానికి చేరుకుని అక్కడ హనుమాన్ ఆలయంలో దేవస్థానం నిర్దేశించిన టికెట్‌ను తీసుకుని మాల విరమణ చేస్తున్నారు. ఆ తర్వాత సాధారణ భక్తుల తరహాలో సీతారాములను దర్శనం చేసుకుని వెళ్తున్నారు. ఒకేసారి ఇరవై నుంచి యాభై మంది భక్తులు వస్తే మాల విరమణ చేసేందుకు కష్టంగా ఉంటోంది. మరోవైపు దేవస్థానం ఆధ్వర్యంలో మిథిలా స్టేడియంలో అనేక హాల్స్ ఖాళీగా ఉన్నాయి. వినియోగించకపోవడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. దేవస్థానం అధికారులు దృష్టి సారించి ఆ హాళ్లను ఉపయోగపడేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

భక్తులు ఏమి కోరుతున్నారంటే..

ఇటీవల కొండగట్టు ఆంజనేయుడికి భద్రాచలం దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు సమర్పించే విధానం అమల్లోకి తెచ్చారు. ఇదే ఒరవడిలో ఆంజనేయ మాల విరమణకు భద్రాచలం వచ్చే భక్తుల కోసం దేవస్థానం తరపున ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. మాల విమరణకు ఒక రోజు ముందుగా భద్రాచలం చేరుకునే భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేసుకునేందుకు వీలుగా హాలు కేటాయించాలి. అనంతరం ఒక రాత్రి నిద్ర, మరుసటి రోజు నదీ స్నానం చేశాక సామూహిక మాల విరమణకు ప్రత్యేక స్థలం కేటాయించాలి. మాల విరమణ టికెట్‌తోనే ఆలయంలో ప్రత్యేక దర్శనం అయ్యేలా చూడాలి. ఈ సౌకర్యాలు అందుబాటులోకి వస్తే హనుమాన్ చిన్న జయంతి, పెద్ద జయంతిల సందర్భంగా ఎంతో ఉపయోగం ఉంటుంది. శ్రీరాముడికి ఆంజనేయుడు వీర భక్తుడు. అంతటి ఆంజనేయుడి భక్తులు హనుమాన్ మాలధారణ/విరమణలకు భద్రాద్రికి రావడం మొదలైతే అయ్యప్ప మాల–శబరిమలై తరహాలో భద్రాచలం మరింతగా ప్రసిద్ధి పొందడంతో పాటు ఆదాయం కూడా పెరుగుతుంది. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందడంతోపాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

సూర్య ప్రతాపం

- వేడి గాలులు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు
- ఖమ్మంలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఖమ్మంగాంధీచౌక్: రోజురోజుకూ సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రోహిణికార్తెలో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఎండలు మండిపోయాయి. జిల్లాలో అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలం ఖానాపురంలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని తొమ్మిది ప్రాంతాల్లో విపరీతమైన ఎండలు ఉండటంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకారు. ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. అత్యవసరం అయితే తప్ప బయట తిరగొద్దంటూ ఇప్పటికే వైద్యులు హెచ్చరించారు. సింగరేణి మండలం కారేపల్లి (గేట్)లో 46.6 డిగ్రీలు, వైరాలో 46.4 డిగ్రీలు, ముదిగొండ, పమ్మిలో 46 డిగ్రీలు, ముదిగొండ మండలం బాణాపురంలో 45.7 డిగ్రీలు నమోదయ్యాయి. అలాగే కొణిజర్లలో 45.2 డిగ్రీలు, నేలకొండపల్లి, చింతకానిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉన్నాయి. 14 ప్రాంతాల్లో 44 నుంచి 44.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు, తొమ్మిది ప్రాంతాల్లో 43 నుంచి 43.3 డిగ్రీలు, ఎనిమిది ప్రాంతాల్లో 40 నుంచి 42.9 డిగ్రీలు నమోదయ్యాయి. మరికొద్ది రోజులు ఇవే ఎండలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పశువులు తరలిస్తున్న లారీల పట్టివేత

తిరుమలాయపాలెం: పశువులను లారీల్లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మండలంలోని సుబ్లేడు క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద గురువారం రాత్రి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని హనుమాన్ జంక్షన్ నుంచి రెండు లారీల్లో (ఒక్కో లారీలో 65 పశువులు) పశువులను హైదరాబాద్ తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా చివ్వెంలకు చెందిన లారీడ్రైవర్లు భూక్యా లింగా, బానోత్ రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పశువులను పండితాపురం సమీపంలోని గోశాలకు తరలించారు. లారీలను సీజ్ చేశారు.

విద్యుత్ మోటార్ చోరీ

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామవాసి వడ్డే యాదయ్యకు చెందిన, వ్యవసాయ బావి వద్ద ఉన్న విద్యుత్ మోటారును గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు మోటార్ చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్



గాయపడిన వ్యక్తి

తల్లాడ: మండలంలోని ఎన్టీఆర్‌నగర్ సమీపంలో శుక్రవారం రాత్రి బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. తల్లాడలోని ఓ మిల్లులో పనిచేస్తున్న కల్లూరుకు చెందిన మహ్మద్ అజీజ్‌పాషా, వత్సవాయి నరేశ్ ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఎన్టీఆర్‌నగర్ దాటిన తర్వాత జాతీయ రహదారిపై వారి ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. 108 ద్వారా వారిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గంజాయి పట్టివేత



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: నగరంలోని ఎస్‌ఆర్ గార్డెన్స్ సమీపంలో ఎక్సైజ్ స్టేషన్-1 సీఐ కృష్ణ అధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా నలుగురు వ్యక్తుల వద్ద 460 గ్రాముల గంజాయి లభ్యమైంది. ఖమ్మం నిజాంపేటకు చెందిన గుత్తికొండ యశ్వంత్, తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణికి చెందిన చింతనేని విజేంద్రప్రసాద్, ఖమ్మం అర్బన్ పాండురంగాపురానికి చెందిన షేక్ అమీర్, డోర్నకల్‌కు చెందిన తేజావత్ నితిన్ సరిహద్దు రాష్ట్రం నుంచి గంజాయి తీసుకొస్తూ పట్టుబడ్డారు. తనిఖీల్లో ఎస్‌ఐలు జయశ్రీ, సాయిబాబా, సిబ్బంది పాల్గొన్నారు.

16 మందిపై కేసు నమోదు

చింతకాని : మండల పరిధిలోని చిన్నమండవ గ్రామంలో భూ వివాదానికి సంబంధించి పర్చగాని వీరభద్రం, సతీష్, వేణులతో పాటు 16 మందిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూ వివాదంలో పర్చగాని వీరభద్రం, సతీష్, వేణు కుటుంబాల వారు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. మూడు వర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 16 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

మము బ్రోవమని చెప్పండి..

- 'సీతారామ' నిర్వాసితులకు అందని పరిహారం
- రైతుల పొలాల్లో జరుగుతున్న లింక్ కెనాల్ పనులు
- నోటీసులు ఇవ్వలేదు.. పరిహారం ప్రకటించలేదు..
- ఆందోళనలో కర్షకులు



ఏన్కూరులో జరుగుతున్న సీతారామ లింక్ కెనాల్ ప్రాజెక్టు పనులు

ఏన్కూరు: తాత, ముత్తాతల కాలం నాటి పొలాలను కాపాడుకుంటూ వస్తుంటే నేడు సీతారామ లింక్ కెనాల్ ప్రాజెక్టు అని తమ పొలాలను దౌర్జన్యంగా లాక్కుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పనులు ప్రారంభించే రెండు నెలల ముందు నోటీసులు ఇస్తామని చెప్పిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆదేశాలను అమలుచేయలేదు. ఎలాంటి పరిహారం ప్రకటించకముందే తమ పొలాల్లో పనులు చేస్తున్నారని, ఇదెక్కడి అన్యాయమంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. పనులను అడ్డుకున్న రైతులకు ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిహారం ఇస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు అంటున్నారని రైతులు వాపోతున్నారు. జూలూరుపాడు మండలం వినోభానగర్ 18వ టన్నెల్ నుంచి ఏన్కూరు మండలం హిమామ్‌నగర్ మీదుగా రేపల్లెవాడ నుంచి ఏన్కూరు ఎన్నెస్పీ కెనాల్ వరకు సీతారామ లింక్ కెనాల్ పనులు 80 మీటర్ల వెడల్పుతో మొదలు పెట్టారు. దీంతో 100 మంది రైతులకు చెందిన సుమారు 120 ఎకరాలు కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. 120 ఎకరాల్లో రైతులు పామాయిల్, మామిడి తోటలు, కరివేపాకు, ఇతర దీర్ఘకాల పంటలు నష్టపోవాల్సి వస్తోంది. పొలాల్లోని బోర్లు, బావులు, చెట్లను సైతం కోల్పోతున్నారు. ఆ పొలాలు కొన్ని రోడ్డు పక్కన ఉండడంతో డిమాండ్ బాగా ఉంది. మార్కెట్‌లో ఎకరం రూ.కోటి ధర పలుకుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, పరిహారం ప్రకటించకుండా పనులు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పరిహారం ఇచ్చే వరకు పనులు నిలిపివేయాలని పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఎవరూ స్పందించడం లేదని అంటున్నారు. మండలంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు పనులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు పరిశీలించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత రైతుల



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

సమస్యను ప్రభుత్వం దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకొస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్న తమ పొలాలను తీసుకొని తమకు పరిహారం కాకుండా వేరే ప్రాంతంలో పొలాలు ఇప్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రెండెకరాలు నష్టపోయాను



సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్ పనులతో రోడ్డు పక్కన గ్రామ సమీపంలోని రెండు ఎకరాల భూమి కోల్పోయాను. భూమి విలువ రూ.2 కోట్లు ఉంటుంది. అధికారులు నోటీసులు, పరిహారం ఇవ్వకుండా పనులు మొదలు పెట్టారు. వంశపారంపర్యంగా వస్తున్న భూములు కోల్పోతుంటే బాధగా ఉంది. రైతులకు సరిపడా పరిహారం ఇవ్వాలి.

– వెనిగండ్ల శ్రీహరి, రైతు, హిమామ్‌నగర్

భూమి కింద భూమి ఇవ్వాలి



సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్‌తో 5 ఎకరాల భూమి పోయింది. పామాయిల్ 2 ఎకరాలు, మెట్ట భూమి 3 ఎకరాలు. బోరు కూడా ఉంది. కానీ ఎటువంటి పరిహారం ఇవ్వలేదు. రోడ్డు పక్కనే భూమి ఉంది, రోడ్డు నుంచి దారి కూడా ఉంది. చాలా విలువ గల భూమి నాది. తిరిగి భూమి కొందామన్న దొరకడం లేదు. మా భూమి కింద భూమి ఇవ్వాలి.

– మేద కృష్ణయ్య, రైతు, ఏన్కూరు

రైతులు నష్టపోతున్నారు



సీతారామ లింక్ కెనాల్ ప్రాజెక్టు పనులు వల్ల గిరిజన రైతులు భూములు కోల్పోతున్నారు. అధికారులు భూ సర్వే చేశారు గానీ పరిహారం ప్రకటించలేదు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నోటీసులు ఇచ్చిన రెండు నెలల తరువాత పనులు మొదలు పెడతామని చెప్పారు. కానీ, దౌర్జన్యంగా పనులు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు పరిహారం ఇవ్వాలి.

– బానోత్ బాలాజీ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు

అనుమతి లేని మట్టి తోలకాలు బంద్

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంరూరల్: ఏదులాపురం చెరువులో అనుమతుల్లేకుండా మట్టి తోలకాలకు చెక్‌పడింది. మట్టి మాఫియా అనే శీర్షికన 'సాక్షి'లో మే 30న ప్రచురితమైన కథనానికి స్పందించిన ఇరిగేషన్ ఈఈ ఎం.వెంకటేశ్వర్లు ఏదులాపురం చెరువును సందర్శించారు. ఎంతమేర మట్టిని తరలించారు? తరలించిందెవరు? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెద్దఎత్తున అనుమతులు లేకుండా మట్టి తరలిస్తుంటే ఏం చేస్తున్నారని సంబంధిత శాఖ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి చెరువులో నుంచి మట్టి బయటకు పోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మట్టి తరలించిన వారి వివరాలు సేకరించి తక్షణమే తనకు అందించాలని పేర్కొన్నారు.



ఏదులాపురం చెరువును పరిశీలిస్తున్న ఈఈ వెంకటేశ్వర్లు

మట్టి తరలింపుపై కలెక్టర్ సీరియస్..?

ఏదులాపురం చెరువు మట్టిని పెద్దఎత్తున తరలించడంపై జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ సీరియస్ అయినట్లు విశ్వసనీయ సమాచారం. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నారని, తక్షణమే ఈ విషయమై నివేదిక ఇవ్వాలని ఐబీ ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

పాపం పసివాడు..

- పదిరోజులైనా కానరాని జాడ..
- పోలీస్ బృందాలతో వేట



అదృశ్యమైన బాలుడు

సత్తుపల్లి: పదకొండు నెలల పసివాడు అదృశ్యమై పదిరోజులు కావస్తోంది.. కుమారుడి కోసం ఆ తల్లి ఏడ్చిఏడ్చి కన్నీళ్లు ఇంకిపోయాయి.. పిల్లోడి కోసం వాకబు చేయని ఊరులేదు.. అయినా బాలుడి జాడ దొరకక పోవటంతో ఆ కన్నతల్లిదండ్రులను చూసినవారు కన్నీటిపర్యంతమవుతున్నారు. సత్తుపల్లి పట్టణ శివారులోని గుడిపాడు గుడారాల్లో నివసిస్తున్న పాల్వంచకు చెందిన వానరాసి జంపన్న, దుర్గ దంపతుల 11 నెలల కుమారుడు సాయిదేవాన్ష్ మే నెల 20వ తేదీ రాత్రి కనిపించకుండా పోయిన విషయం పాఠకులకు విదితమే. అప్పటి నుంచి కన్నతల్లిదండ్రులతో పాటు సంచార జీవితం సాగిస్తున్న బుడగ జంగాలు బాలుడి ఆచూకీ కోసం తమ శక్తి మేరకు వెతుకులాడుతూనే ఉన్నారు. అయినా ఇప్పటి వరకు కనీసం బాలుడి జాడ తెలియక పోవటంతో ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూనే ఉన్నారు.

ఏసీపీ రఘు విచారణ

బాలుడు అదృశ్యమైన ప్రాంతాన్ని కల్లూరు ఏసీపీ ఎ.రఘు, సీఐ టి.కిరణ్ శుక్రవారం మరోసారి పరిశీలించి విచారణ చేపట్టారు. ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న బుడ జంగాల వివరాలను పోలీస్ సిబ్బందితో క్షుణ్ణంగా సేకరిస్తున్నారు. ఎప్పటి నుంచి ఉంటున్నారు..? పిల్లవాడు అదృశ్యమైన రోజు ఎంత మంది ఉన్నారు..? ఈ స్థలం ఎవరిది..? గుడారాలు వేసుకొని ఉంటున్నవారి ఫోన్ నెంబర్లు..? ఎక్కడెక్కడి నుంచి వచ్చారు. ఇలాంటి ప్రతి సమాచారాన్ని సేకరించారు. అనుమానాస్పదంగా ఆ రోజు ఎవరెవరు కన్పించారు అనే విషయాన్ని తెలుసుకునేందుకు తల్లిదండ్రులను విడివిడిగా అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు.



గుడారాలలో నివసిస్తున్న వారి వివరాలను సేకరిస్తున్న పోలీస్ సిబ్బంది

క్లూస్‌ను పట్టుకొని..

బాలుడు అదృశ్యమైన రోజు ఈ ప్రాంతంలో ఎవరెవరు సంచరించారు? అనే విషయాలను పోలీసులు క్లూస్ పట్టుకొని లోతైన విచారణ చేపట్టారు. ఆ రోజు అనుమానాస్పదంగా తిరిగిన వాహనాన్ని గుర్తించి ఆ దిశలో విచారణను వేగవంతం చేశారు. ఈ తరహా కిడ్నాప్ కేసులు ఎక్కడెక్కడ జరిగాయి..? దాని వివరాలను సేకరించి ఈ కేసుతో సరిపోల్చి చూస్తున్నారు. హైదరాబాద్‌లో పట్టుబడిన పిల్లల ఫొటోలను సైతం తల్లిదండ్రులకు చూపించారు. పిల్లవాడు అదృశ్యమైన రాత్రి సమయంలో జరిగిన ప్రతి చిన్న ఘటనను గుర్తుకు తెచ్చుకొని చెప్పేలా అక్కడే ఉంటున్న స్థానికులను పలు కోణాల్లో విచారిస్తున్నారు.

కారేపల్లి బంక్‌లో డీజిల్‌కు బదులు నీళ్లు

బంక్ ఎదుట రైతుల ఆందోళన



నీళ్లలాగా కనిపిస్తున్న డీజిల్



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజారాం

కారేపల్లి: కారేపల్లిలోని ఓ పెట్రోల్ బంక్‌లో డీజిల్‌లో నీళ్లు వచ్చాయంటూ శుక్రవారం రాత్రి డీజిల్ కొనుగోలుదారులు ఆందోళన చేసిన ఘటన చోటుచేసుకుంది. మాధారానికి చెందిన గుగులోత్ కృష్ణ తన జేసీబీలో డీజిల్ కొట్టించుకోవడంతో పాటు క్యాన్లలో కూడా డీజిల్ పోయించుకున్నాడు. జేసీబీ నడుస్తూ ఆగిపోవడంతో డీజిల్ అయిపోయిందని మరికొంత డీజిల్ క్యాన్ నుంచి పోస్తుండగా డీజిల్‌కు బదులుగా నీళ్లు కనిపించాయి. దీంతో జేసీబీ నడవకుండా ఉండటానికి కారణం కల్తీ డీజిల్ అని తెలిసి బాధితుడు కారేపల్లి పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుని బంకు యాజమాన్యాన్ని నిలదీశాడు. ఆయనతో పాటు మరికొందరు కూడా కల్తీ జరిగిందంటూ పెట్రోల్ బంక్ వద్ద ఆందోళనకు దిగారు. తాను క్యాన్లలో కొనుగోలు చేసిన డీజిల్‌ను బకెట్‌లో పోయగా దానిలో నీళ్లు కనిపించాయి. ఘటనా స్థలానికి ఎస్‌ఐ రాజారాం చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడి సముదాయించారు. దీంతో కొందరు డీజిల్ కొనుగోలుదార్లకు యాజమాన్యం డబ్బులు తిరిగి ఇచ్చింది. డీజిల్‌లో కల్తీ ఎలా జరిగిందో తెలియడం లేదని దీనిపై విచారిస్తామని బంక్ యాజమాన్యం తెలిపింది.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో రోడ్డు పక్కన నిలిపిన ద్విచక్రవాహనం, బడ్డీ కొట్టును శుక్రవారం లారీ ఢీ కొట్టింది. స్థానికుల కథనం ప్రకారం.. వైరా వైపు నుంచి ఖమ్మం వస్తున్న లారీ డ్రైవర్ వడదెబ్బకు గురయ్యాడు. లారీని రోడ్డు పక్కన నిలిపే యత్నంలో బడ్డీకొట్టు, బైక్‌ను ఢీకొట్టాడు. తృటిలో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెప్పారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

నేలకొండపల్లి: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన జి.గోపి (25) ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రావణమాసంలో వివాహం జరగాల్సి ఉండగా ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశమైంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు



మంటల్లో దగ్ధమవుతున్న ట్రాన్స్‌ఫార్మర్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉనన ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో గురువారం అర్ధరాత్రి మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అకస్మాత్తుగా మంటలు రావడంతో ప్రజలు అగ్నిమాపక, విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న విద్యుత్ శాఖ అధికారులు దగ్ధమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడ అమర్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

చెరువుకట్టపై మృతదేహం లభ్యం



పాపారావు మృతదేహం

చండ్రుగొండ: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆనుకుని ఉన్న ఊరచెరువు కట్టపై ఓ వ్యక్తి విగతజీవిగా కనిపించాడు. వివరాలిలా ఉన్నాయి.. చెరువుకట్టపై ఓ వ్యక్తి మృతదేహం ఉండటాన్ని శుక్రవారం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రవి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అతడి జేబులో ఉన్న గుర్తింపు కార్డు ఆధారంగా చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడుకు చెందిన కర్రి పాపారావు (56)గా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హత్య కేసు నిందితుడి అరెస్ట్

24 గంటల్లోనే పట్టుకున్న వన్‌టౌన్ పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్, సీఐ

కొత్తగూడెంటౌన్: హత్య జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించి.. నిందితుడు తమ్మిశెట్టి కోటేశ్వరరావును కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కొత్తగూడెం పట్టణం పోస్టాఫీస్ సెంటర్‌లో మద్యం మత్తులో గుణదీప్ (21)ను తమ్మిశెట్టి కోటేశ్వరరావు కొట్టి హత్య చేశాడు. శుక్రవారం రాత్రి వివరాలను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐ కరుణాకర్ తెలిపారు. 25 రోజుల కిందట తమ్మిశెట్టి కోటేశ్వరరావుకు, ఆర్యభట్ట గంగాధర వరప్రసాద్‌కు గొడవ జరిగింది. ఈ నెల 30వ తేదీ గురువారం గుణదీప్, అతడి స్నేహితుడు ఆర్యభట్ట గంగాధర వరప్రసాద్ కలిసి బార్‌షాపులో మద్యం సేవించారు. ఈ క్రమంలో కోటేశ్వరరావు గంగాధర వరప్రసాద్‌తో వాగ్వాదానికి దిగాడు. గుణదీప్ ఇద్దరికీ సర్దిజెప్పాడు. ఈ క్రమంలో గుణదీప్‌కు మద్యం ఇప్పిస్తానని చెప్పి కోటేశ్వరరావు బలవంతం స్కూటీపై ఎక్కించుకుని పోస్టాఫీస్ సెంటర్‌లోని వైన్‌షాపునకు తీసుకొచ్చాడు. ఈ క్రమంలో డబ్బులు కట్టే విషయంలో ఇద్దరికీ గొడవ జరిగింది. గుణదీప్‌ను తమ్మిశెట్టి కోటేశ్వరరావు కిందపడేసి గుండెలపై బలంగా తన్నడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు డీఎస్పీ తెలిపారు. గతంలో గొడవ జరిగిన సమయంలో ఉన్న మోహన్ అనే వ్యక్తి అనుకుని మద్యం మత్తులో గుణదీప్‌ను కొట్టి చంపినట్లు నిందితుడు అంగీకరించాడని, ఈ గొడవలో మరణించిన గుణదీప్, అతని సోదరుడు హిమవంత్‌కు ఏమాత్రం సంబంధం లేదని చెప్పారు. గుణదీప్ పెదనాన్న రాజేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, 24 గంటల్లోగా నిందితుడిని పట్టుకున్న కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్, బృందం సభ్యులను డీఎస్పీ అభినందించారు.

తండ్రిపై కుమారుడి దాడి

కౌలుకు పొలం ఇవ్వకపోవడంతో కక్ష

కొణిజర్ల: కొన్నేళ్లుగా తనకున్న ఐదెకరాల పొలాన్ని కొడుకే దున్నుకుంటూ తనకు డబ్బులు ఇవ్వడం లేదని, ఈ ఏడాది కౌలుకు పొలం ఇవ్వనందుకు తనపై మారణాయుధాలతో దాడి చేశాడని మండలంలోని రామనరసయ్యనగర్‌కు చెందిన మాజీ సర్పంచ్ పాలె సరవయ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. రామనరసయ్యనగర్‌లో సరవయ్యకు ఐదు ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని తన కొడుకు రమేశ్ దున్నుకుంటున్నాడు. కానీ, దీనికి సంబంధించి కౌలు డబ్బులు సరవయ్యకు ఇవ్వడం లేదు. సరవయ్య ఈ ఏడాది ఖరీఫ్‌లో తన భూమి వేరే వ్యక్తికి కౌలుకు ఇవ్వాలని నిర్ణయించుకుని కొడుకుకు విషయం చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం నాడు సరవయ్య, తన భార్య వరమ్మ మధ్య వాగ్వాదం జరుగుతుండటంతో ఇదే అదునుగా భావించిన రమేశ్, ఆయన భార్య ఇందిరమ్మ, వారి కుమారుడు వర్ధన్ మూకుమ్మడిగా సరవయ్యపై దాడి చేశారు. తప్పించుకున్న సరవయ్య శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీసీఎం వ్యాన్ బోల్తా

ఒకరు మృతి



గువ్వలగూడెం వద్ద పల్టీకొట్టిన డీసీఎం వ్యాన్

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం గ్రామంలో డీసీఎం వ్యాన్ బోల్తాపడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. రాజమండ్రి నుంచి మిర్యాలగూడెంకు పనసకాయలతో వెళ్తున్న డీసీఎం గువ్వలగూడెం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు పల్టీకొట్టింది. అదులో ప్రయాణిస్తున్న నాగరాజు (38), వై.ప్రభాకర్ (35)కు తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అందులో నాగరాజు పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల – ఎర్రుపాలెం గ్రామాల మధ్య వైన్‌షాప్ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జయంతి గ్రామానికి చెందిన పడిగెల శ్రీనివాసరావు (50) శుక్రవారం ఉదయం బజారుకు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి బయలుదేరాడు. అక్కడి నుంచి అదే గ్రామానికి చెందిన భీమిరెడ్డి వెంకటరెడ్డి, గున్నం వెంకటరెడ్డితో కలిసి ఎర్రుపాలెం గ్రామానికి వచ్చి, వైన్‌షాపునకు వెళ్లి మద్యం సేవించారు. ఓ చెట్టు కిందికి వచ్చి గొడవపడ్డారు. ఆ తర్వాత శ్రీనివాసరావు మృతి చెందిన విషయాన్ని భీమిరెడ్డి నరేందర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు తెలిపాడు. మధిర సీఐ మధు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భీమిరెడ్డి నరేందర్‌రెడ్డి, గున్నం వెంకటరెడ్డి తమ తండ్రి మృతికి కారకులని మృతుడి కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, సీఐ మధు, ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి...



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి, చింతకాని రైల్వేస్టేషన్ల మధ్య 497 కిలోమీటర్ వద్ద శుక్రవారం రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు కథనం ప్రకారం.. విజయవాడ వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్లే రైలు నుంచి సుమారు 38 ఏళ్ల వయస్సు కల్గిన వ్యక్తి జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతుడు చామనఛాయ రంగుతో, ఎరుపు, నలుపు రంగు గీతలు గల తెల్లని చొక్కా, నల్లని ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు బృందం ద్వారా ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి...

ఖమ్మంక్రైం: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి(35) మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు కథనం ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలును ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని అన్నం శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58589, 94932 18856 నెంబర్లలో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

బావిలో పడి యువకుడు...

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని రాయగూడెంకు చెందిన పి.వేణు (37) గురువారం సాయంత్రం పొలానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.